PRGI No : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 334 పేజీలు - 08 బుధవారం 28 అక్టోబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## తెలంగాణలో కరువు
# కల్లోలం..

365 మండలాలు ప్రభావితం!

111 మండలాల్లో తీవ్ర కరువు..

రైతులకు సాయం, తాగునీరు,

పశుగ్రాసంపై ప్రభుత్వ దృష్టి









## అభిషేక్ శర్మ తుఫాన్.. భారత్‌కు
# సిరీస్ కైవసం!

35 బంతుల్లోనే శతకం.. న్యూజిలాండ్‌పై ఆరు వికెట్లతో ఘన విజయం

## రాజీవ్ ప్రధాని కావడాన్నే
# వ్యతిరేకించా!

సోనియా గాంధీ ఆత్మకథలో సంచలన విషయాలు!



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 27 :** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తన జీవితంలోని వ్యక్తిగత, రాజకీయ అనుభవాలను ఆత్మకథ రూపంలో వెల్లడించనున్నారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో రూపొందిన ఈ పుస్తకం నవంబర్ 10న విడుదల కానుంది.ఇందిరా గాంధీ హత్య అనంతరం రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి కావడాన్ని

మిగతా2లో...

## భూ సర్వేలో నిర్లక్ష్యం చేస్తే
# కఠిన చర్యలు!

- రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: మంత్రి పొంగులేటి
- ఏడాదిన్నరలో భూ సర్వే పూర్తి.. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు






## తుఫాన్ సహాయక చర్యల్లో
# నిర్లక్ష్యం వద్దు!

- ప్రజల ప్రాణాలే ప్రాధాన్యం..

అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశాలు

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 27 :** ఆర్నబ్ తుఫాన్ ముప్పు నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ ఆదేశించారు. కాకినాడ జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో

మిగతా2లో...

## డిసెంబర్ 9న మహిళలకు
# కుట్టు మిషన్లు!

• 1.90 లక్షల మంది బీసీ మహిళలకు లబ్ధి • 4.80 లక్షల దరఖాస్తులు..

పంపిణీకి కార్యాచరణ సిద్ధం చేయండి: మంత్రి పొన్నం ప్రభాకర్



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 27 :** తెలంగాణలో బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో చేపట్టిన 'ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్ల' పథకం అమలును వేగవంతం చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 9న కుట్టు మిషన్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ పథకానికి ఇప్పటికే 4.80 లక్షల దరఖాస్తులు అందాయని, తొలి దశలో 1.90 లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూర్చేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. మంగళవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ, విద్యా నిధి పథకాలపై నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటించాలని, అర్హులైన వారికి సకాలంలో ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కుట్టు మిషన్ల పంపిణీకి సంబంధించిన టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

**గురుకులాలకు సొంత భవనాలు** రాష్ట్రంలో 327 బీసీ గురుకుల పాఠశాలలు ఉండగా, వాటిలో కేవలం 26 పాఠశాలలకే సొంత భవనాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. మిగిలిన 301 పాఠశాలలకు శాశ్వత భవనాలు కల్పించేందుకు భూసేకరణ, నిర్మాణ

మిగతా2లో...



## నిజాయితీగా జరిగితేనే ఎన్నికల ఫలితాలను అంగీకరిస్తా: ట్రంప్

అమెరికా మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడి వ్యాఖ్యలు

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 27 :** అమెరికాలో నవంబర్ 3న జరగనున్న మధ్యంతర ఎన్నికల ఫలితాలను నిజాయితీగా జరిగిన ఎన్నికలుగా భావిస్తేనే అంగీకరిస్తానని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలను ఎలాంటి పరిస్థితుల్లోనైనా అంగీకరిస్తారా అని విలేకరులు ప్రశ్నించగా, ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగితే అంగీకరిస్తానని సమాధానమిచ్చారు. ఎన్నికల్లో తమ పార్టీ ఓడిపోతే ప్రతిపక్ష డెమోక్రాట్లతో కలిసి పనిచేయాల్సి వస్తుందని ట్రంప్ వ్యాఖ్యానించారు.

మిగతా2లో...

## కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని
# ఎత్తిపోయాలి!

• తాగు, సాగునీటితో పాటు విద్యుత్‌కూ ఉపయోగం: మాజీమంత్రి జీవన్‌రెడ్డి




**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 27 :** ఎల్‌నినో ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి టి. జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నీటిని ఎత్తిపోయేందుకు తగిన నీటిమట్టం లేకపోతే కాఫర్ డ్యాం నిర్మించాలని సూచించారు. రైతులు నీరు, విద్యుత్ అడగవద్దన్నట్టుగా వ్యవహరిస్తూ, వరి విత్తనాలు కొనుగోలు చేసే రైతుల నుంచి స్వీయ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి

మిగతా2లో...

# తుఫాన్ సహాయక చర్యల్లో నిర్లక్ష్యం వద్దు!

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం రాష్ట్ర సచివాలయంలో తుఫాన్ సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ప్రజల ప్రాణనష్టం జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని, తుఫాన్ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి** తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి, అక్కడ నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ముఖ్యంగా 92 తుఫాన్ ప్రభావిత ఆవాసాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు ప్రజలకు అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**ఏలేరు వరద ప్రవాహంపై నిఘా** ఏలేరు వరద ప్రవాహంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పవన్ కల్యాణ్ సూచించారు. చెరువులు, కాలువలు, వాగులు, రహదారులు, వంతెనల పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల వల్ల విద్యుత్ సరఫరా, తాగునీటి పంపిణీ, రహదారులకు అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరించేందుకు సిబ్బంది, యంత్రాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

మత్స్య కారులు సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచేలా చూడాలని సూచించారు. తుఫాన్ సహాయక చర్యల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని, ప్రజలకు అవసరమైన సహాయాన్ని వేగంగా అందించాలని పవన్ అధికారులకు స్పష్టం చేశారు.

# తెలంగాణలో కరువు కల్లోలం..

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 27 :** తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపుతున్నాయి. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్2026 సీజన్‌కు సంబంధించి 31 జిల్లాల్లోని 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించింది. వీటిలో 111 మండలాలను తీవ్ర కరువు, 254 మండలాలను మధ్యస్థ కరువు ప్రభావిత ప్రాంతాలుగా వర్గీకరించింది. కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఉపశమనం కల్పించడంతో పాటు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.**సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం**ఈ ఏడాది జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రంలో సాధారణంగా 740.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, 615.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో సాధారణం కంటే 17 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. వర్షాలు సకాలంలో కురవకపోవడం, పంటలకు అవసరమైన తేమ అందకపోవడం వల్ల సాగు విస్తీర్ణం తగ్గింది. గతంలో వరి సాగు 69.19 లక్షల ఎకరాలుగా ఉండగా, ఈ సీజన్‌లో సుమారు 57 లక్షల ఎకరాలకు తగ్గినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

**రైతులకు పెట్టుబడి సాయంపై ఆశలు**

కరువు ప్రభావంతో నష్టపోతున్న రైతులకు ఆర్థికంగా అండగా నిలవడం కీలకంగా మారింది. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం సాయం అందించడం, పంటల పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం అవసరమని వ్యవసాయ వర్గాలు పేర్కొంటున్నాయి. సాగు కోసం పెట్టిన పెట్టుబడులు తిరిగి రాకపోతే రైతు కుటుంబాలపై ఆర్థిక భారం పెరిగే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కరువు ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు ఉపశమనం కలిగించే చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించింది. **తాగునీరు, పశుగ్రాసానికి ప్రాధాన్యం** వర్షాలు తక్కువగా కురవడంతో నీటి వనరుల్లో నిల్వలు తగ్గే అవకాశం ఉన్నందున గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అలాగే పశువులకు మేత, నీరు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా కరువు ప్రభావాన్ని కొంతవరకు తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

**కేంద్ర సాయం కోరే దిశగా చర్యలు**

కరువు ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను అంచనా వేసి, అవసరమైన సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సహకారం కోరే అంశంపై దృష్టి సారిస్తోంది. క్షేత్రస్థాయి పరిశీలనలు, నష్టం అంచనాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉంది. 365 మండ లాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన నేపథ్యంలో రైతులకు సాయం, తాగునీటి సరఫరా, పశుగ్రాసం, గ్రామీణ ఉపాధి వంటి అంశాల్లో సమర్థవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

ప్రభుత్వ ప్రకటనతో పాటు క్షేత్రస్థాయిలో సహాయం వేగంగా అందితేనే కరువు ప్రభావిత కుటుంబాలకు నిజమైన ఉపశమనం లభించనుంది.

# ఆయిల్‌పామ్ సాగు విస్తరణే లక్ష్యం!

**● రైతులకు నాణ్యమైన మొక్కలు అందించాలి: మంత్రి తుమ్మల**

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 27 :** తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు నాణ్యమైన మొక్కలను సకాలంలో అందించేలా కంపెనీలు చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన ఆయన, ఆయిల్‌పామ్ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురంలో ఏర్పాటు చేస్తున్న సమీకృత ఆయిల్‌పామ్ యూనిట్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని కంపెనీ ప్రతినిధులు మంత్రిని కోరారు. యూనిట్‌కు అవసరమైన రహదారి విస్తరణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆరోతరం సంకర ఆయిల్‌పామ్ విత్తనాల ఉత్పత్తి కోసం దేశంలోనే తొలి విత్తన తోట ఏర్పాటు చేసేందుకు అదనంగా 35



ఎకరాల భూమి కేటాయించాలని కోరారు. ఆధునిక ఆయిల్‌పామ్ పరిశ్రమ అభివృద్ధి కోసం అదనపు జిల్లాలను కేటాయించాలని, గెలల ధరల నిర్ణయంలో కంపెనీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రతినిధులు సూచించారు. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. రహదారి విస్తరణ, భూమి కేటాయింపు సమస్యలను జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా, గోద్రెజ్ అగ్రోవెట్ ఎండీ, సీఈవో సునీల్ కటారియా, గ్రూప్ హెడ్ రాకేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపూర్ జలాశయం నుంచి జూరాలకు కృష్ణా జలాలు

## - సాగునీటి అవసరాలు.. రైతుల పంటల పరిరక్షణపై దృష్టి

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 27 :** కర్ణాటకలోని నారాయణపూర్ జలాశయం నుంచి తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు కృష్ణా జలాల తరలింపు అంశం కీలకంగా మారింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల కింద సాగు చేస్తున్న పంటలకు నీటి అవసరాలు ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వాన్ని నీటి విడుదలకు కోరింది. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం దశలవా రీగా నీటిని విడుదల చేసేందుకు అంగీకరించి నట్లు గతంలో వార్తలు వెలువడ్డాయి. అయితే, నారాయణ పూర్ నుంచి ఆశించిన స్థాయిలో నీరు చేరకపోవడంతో జూరాల ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొన్నట్లు అక్టోబర్ ప్రారంభంలో వార్తలు



వచ్చాయి. పంటలను కాపాడటంతో పాటు రాబోయే రోజుల్లో తాగునీటి అవసరాలను తీర్చేందుకు నీటి లభ్యతను సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.

# అభిషేక్ శర్మ తుఫాన్.. భారత్‌కు సిరీస్ కైవసం!

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 27 :** న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో భారత జట్టు హ్యాట్రిక్ విజయంతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. మూడో టీ20లో ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగడంతో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 30తో సిరీస్‌ను సొంతం చేసుకుంది.మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. డారిల్ మిచెల్ 89 పరుగులతో అజేయంగా నిలవగా, ఫిన్ అలెన్ 40, బెవాన్ జాకబ్స్ 39 పరుగులు చేశారు. 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 13.2 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి 199 పరుగులు చేసి విజయం సాధించింది. అభిషేక్ శర్మ కేవలం 38 బంతుల్లో 9 ఫోర్లు, 11 సిక్సర్లతో 113 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతడు 35 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 19 బంతుల్లో 45 పరుగులతో మెరిపించాడు.వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 42 బంతుల్లోనే 133 పరుగులు జోడించారు. తొలి ఆరు ఓవర్లలోనే భారత్ వికెట్ నష్టపోకుండా 118 పరుగులు సాధించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. టీ20ల్లో భారత తరఫున అత్యధిక శతకాలు సాధించిన ఆటగాడిగా అభిషేక్ శర్మ 11 శతకాలతో విరాట్ కోహ్లీని అధిగమించాడు. ఈ అద్భుత ప్రదర్శనకు అభిషేక్ శర్మకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

# రాజీవ్ ప్రధాని కావడాన్నే వ్యతిరేకించా!

(మొదటి పేజీ తరువాయి)

తాను వ్యతిరేకించినట్లు సోనియా తన పుస్తకంలో వెల్లడించారు. తన జీవిత కథను ఇన్నాళ్లూ ఇతరులే చెప్పారని, ఇప్పుడు తన అనుభవాలను తానే పాఠకులతో పంచుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు.కేంబ్రిడ్జ్‌లో రాజీవ్ గాంధీతో పరిచయం, ప్రేమ, వివాహం, నెహ్రూగాంధీ కుటుంబంతో జీవితం, కుటుంబంలో ఎదురైన విషాదాలు, రాజకీయ ప్రస్థానం వంటి అంశాలు ఈ ఆత్మకథలో చోటుచేసుకోనున్నాయి. తన జీవితంలోని కీలక మలుపులను సోనియా ఏ విధంగా వివరించారన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది.

# నిజాయితీగా జరిగితేనే ఎన్నికల ఫలితాలను అంగీకరిస్తా: ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

అలాంటి పరిస్థితి ఎదురైతే చర్చల ద్వారా ముందుకు సాగుతామని, అధ్యక్షుడిగా తనకు వీటో అధికారం ఉందని పేర్కొన్నారు.మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఓటర్ల మోసానికి సంబంధించిన ఆరోపణలను ఆయన మరోసారి ప్రస్తావించారు. అయితే, ఎన్నికల అక్రమాలపై ఆయన చేసిన విస్తృత ఆరోపణలకు ఆధారాలు లేవని వార్తా నివేదికలు పేర్కొన్నాయి.

# భూ సర్వేలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు!

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 27 :** భూ సర్వే, రెవెన్యూ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. మంగళవారం సంగారెడ్డిలో ఉమ్మడి మెదక్ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, గృహ నిర్మాణ శాఖల పనితీరుపై మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామితో కలిసి సమీక్ష నిర్వహించారు. రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.**భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం** రాష్ట్రంలో భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడంతో పాటు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా భూ పునఃసర్వే చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే 380 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మరో 900 గ్రామాల్లో చివరి దశకు చేరుకుందని పేర్కొన్నారు. ఏడాదిన్నరలోపు రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములు, ఆబాదీ ఆస్తుల సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.సర్వే సమయంలో భూమి విస్తీర్ణం, హద్దుల వివరాలను రైతులకు స్పష్టంగా తెలియజేయాలని, తహసీల్దార్ల నుంచి జిల్లా కలెక్టర్ల వరకు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సూచించారు.**పేదలకు సొంతింటి కల సాకారం** అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కొనసాగుతుందని పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా రెండు లక్షల ఇళ్లను మంజూరు చేసిందని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి, అర్హులకు పారదర్శకంగా కేటాయించాలని అధికారులను ఆదేశించారు.**ఎల్‌నినో ప్రభావంపై ఆందోళన** ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిపోయే ప్రమాదం ఉందని మంత్రి హెచ్చరించారు. రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రెండో పంట సాగుపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి, నీటి లభ్యతను బట్టి సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు.ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 9న మహిళలకు కుట్టు మిషన్లు!

(మొదటి పేజీ తరువాయి)

అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే 38 బీసీ ఆత్మగౌరవ భవనాలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.బీసీ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెంచేలా అధ్యయన కేంద్రాల్లో నాణ్యమైన శిక్షణ అందించాలని, బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణ కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఆధునిక రజక ధోబీఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.మహిళలకు స్వయం ఉపాధి, బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పథకాలను వేగంగా అమలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలి!

(మొదటి పేజీ తరువాయి)

ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలని కోరారు.వృథాగా సముద్రంలోకి వెళ్తున్న ప్రాణహిత జలాలను వినియోగించుకునే అవకాశం ఉందని, వాటితో తాగునీరు, సాగునీటి అవసరాలు తీర్చడంతోపాటు విద్యుత్ ఉత్పత్తికీ ప్రయోజనం కలుగుతుందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. పాలన చేయలేని పరిస్థితి ఉంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుకుని గవర్నర్‌కు బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు.

# బీసీ బిడ్డల రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదు!

**ఇఎల్వీ భాస్కర్‌కు బీసీ యువజన సంఘం మద్దతు**

**బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు: వీరమళ్ళ కార్తీక్ గౌడ్**




**తొలి అక్షరం/చౌటుప్పల్. అక్టోబర్ 27:** బీసీ బిడ్డలు రాజకీయాల్లో ఎదగడం కొందరికి ఇష్టం లేదా? ప్రజలకు సేవ చేస్తూ నాయకులుగా గుర్తింపు పొందడం తప్పా? బీసీ యువత రాజకీయాల్లోకి రావొద్దా? అంటూ బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు వీరమళ్ళ కార్తీక్ గౌడ్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈఎల్వీ భాస్కర్‌కు మద్దతుగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉద్యోగం, వైద్యం, ఆధ్యాత్మికం వంటి రంగాలతో పాటు సామాజిక సేవలోనూ ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్నారని కార్తీక్ గౌడ్ తెలిపారు. పేదలకు వైద్య సహాయం అందించడం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కోసం కృషి చేయడం, విద్యార్థులకు అవసరమైన సహకారం అందించడం వంటి సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతున్న వ్యక్తిపై అనవసర విమర్శలు చేయడం సరికాదన్నారు. ఒక బీసీ వ్యక్తి ప్రజా సేవ ద్వారా గుర్తింపు పొందుతూ రాజకీయంగా ఎదగాలని ప్రయత్నిస్తే అడ్డంకులు సృష్టించడం, ఆయన సేవలను తప్పుగా చిత్రీకరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఈఎల్వీ భాస్కర్ సేవా కార్యక్రమాలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో ప్రశ్నించాలని, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను పక్కనపెట్టి వ్యక్తిగతంగా విమర్శలు చేయడాన్ని సహించబోమని స్పష్టం చేశారు. రాజకీయాలు ఏ ఒక్క సామాజిక వర్గానికి సొంతం కాదని, రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాలతో ప్రతి ఒక్కరికీ రాజకీయాల్లో పాల్గొనే హక్కు ఉందని కార్తీక్ గౌడ్ అన్నారు. బీసీ యువత విద్య, ఉద్యోగాలు, వ్యాపారాలతో పాటు రాజకీయ రంగంలోనూ ముందుకు రావాలని, తమ సమస్యలను తామే బలంగా వినిపిస్తూ ప్రజలకు ప్రాతినిధ్యం వహించాలని పిలుపునిచ్చారు. బీసీ యువత ఎదుగుదలను అడ్డుకోవాలని చూసే ప్రయత్నాలను ప్రశ్నిస్తామని, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమాన అవకాశాల కోసం బీసీ యువజన సంఘం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈఎల్వీ భాస్కర్‌కు తమ సంఘం తరపున మద్దతు, సంఘీ భావం ప్రకటిస్తున్నామని వెల్లడించారు. బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడు కొప్పు రామకృష్ణ, బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ నాయకుడు సూర్వి శ్రీకాంత్ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి కొత్త రాజు, యశ్వంత్, మణి, సాయిచరణ్, పందు తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీకి చిరునామా.. విధి నిర్వహణలో చెరగని ముద్ర!

**- రూరల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న జి. మన్మధ కుమార్‌కు శుభాకాంక్షలు**



**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 27:** చౌటుప్పల్‌లో రెండేళ్లుగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నిబద్ధతతో సేవలందించిన జి. మన్మధ కుమార్ రూరల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు. విధి నిర్వహణలో నిజాయితీతో, ప్రజలకు భరోసా కల్పిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన గుర్తింపు పొందారు. నూతన బాధ్యతల్లోనూ మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షిస్తున్నాం. శుభాకాంక్షలతో: దోర్నాల గజేందర్, తొలి అక్షరం, చౌటుప్పల్ ప్రతినిధి.

# చౌటుప్పల్ నూతన సీఐ సతీష్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకుల అభినందనలు




**తొలి అక్షరం / చౌటుప్పల్, అక్టోబర్ 27:** చౌటుప్పల్ నూతన వలయ పోలీసు అధికారి డి. సతీష్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్, చిన్నం బాలరాజు కురుమ, ఢిల్లీ మాధవరెడ్డి, గుండెబోయిన అయోధ్య యాదవ్, అల్మాస్‌పేట కృష్ణ, చిట్టంపల్లి సాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# టీపీయూఎస్ మండల అధ్యక్షుడిగా నాగేష్ నాయక్

**- నర్సింహులపేట నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక.. వివిధ సంఘాల నుంచి ఉపాధ్యాయుల చేరిక**




**తొలిఅక్షరం/నర్సింహులపేట అక్టోబర్ 27:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) నర్సింహులపేట మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిబోయిన గోపికృష్ణ, ఎన్నికల అధికారి బండ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ ఎన్నికలు నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా భూక్య నాగేష్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా కుందారం బాల లింగం, కోశాధికారిగా ఎస్.రాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బానోత్ కిషోర్, బి.నర్సన్న, మహిళా కార్యదర్శిగా రజనీ దేవి, కార్యదర్శిగా ఎస్.బాల వేణు బాధ్యతలు చేపట్టనున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా డి.సికిందర్, బి.వీరేశం, టి.రాజు ఎన్నికయ్యారు.

**టీపీయూఎస్‌లోకి పలువురు ఉపాధ్యాయులు** వివిధ ఉపాధ్యాయ సంఘాలకు చెందిన పలువురు టీపీయూఎస్‌లో చేరారు. పీఆర్టీయూటీఎస్ నుంచి బి.నాగేష్, బి.కిషోర్, జి.మంగు బ్రహ్మచారి, టీపీటీఎఫ్ నుంచి డి.సికిందర్, ఎ.రవి, టీపీఆర్టీయూ నుంచి బి.రాంజీ నాయక్, టీఎస్‌యూటీఎఫ్ నుంచి బి.నర్సన్న సంఘంలో చేరినట్లు ప్రతినిధులు వెల్లడించారు. నాగేష్ నాయక్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.

**ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి** నూతన అధ్యక్షుడు భూక్య నాగేష్ నాయక్ మాట్లాడుతూ మండల ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీ, డీఏలు, సీపీఎస్ రద్దు తదితర అంశాలపై రాష్ట్ర శాఖ జేఏసీ ద్వారా ప్రభుత్వంతో చర్చలు జరుపుతోందన్నారు.

టీపీయూఎస్ బలపరిచిన ఎమ్మెల్సీలు ముల్క కొమరయ్య, ఏవీఎన్ రెడ్డి ఉపాధ్యా యుల సమస్యలపై స్పందిస్తున్నారని పేర్కొన్నారు. గత నెలలో నిర్వహించిన ధర్నా అనంతరం రెండు డీఏలు సాధించడంలో సంఘం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గం ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, విద్యా రంగ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా శాఖ ప్రతినిధులు ఆకాంక్షించారు.

# నీరు, విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత

**- చౌటుప్పల్ ప్రజలు వృథాను అరికట్టాలి: చెరుకు లింగస్వామి గౌడ్**



**తొలి అక్షరం / చౌటుప్పల్, అక్టోబర్ 27:** నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తూ భవిష్యత్ తరాలకు సహజ వనరులను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చెరుకు లింగస్వామి గౌడ్ అన్నారు. నీటిని అవసరమైన మేరకే వినియోగించాలని, పైపుల లీకేజీలను అరికట్టాలని సూచించారు. అవసరం లేనప్పుడు విద్యుత్ పరికరాలను నిలిపివేయాలని కోరారు. ప్రజలందరూ పొదుపు అలవాట్లను పాటించి పట్టణ అభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి!

**- దళారులను నమ్మి నష్టపోవద్దు.. మద్దతు ధర పొందాలి**



**తొలి అక్షరం / చౌటుప్పల్, అక్టోబర్ 27:** రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు ధాన్యం విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి సూచించారు. చిన్నకొండూరు, పెద్దకొండూరు, మసీదుగూడెం, గుండ్లబావి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ప్రభుత్వం క్వింటా ధాన్యానికి రూ.2,416 మద్దతు ధర నిర్ణయించిందని, కొనుగోలు చేసిన ధాన్యానికి నగదును మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాల నేపథ్యంలో నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మార్కెట్ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# ఆస్తిలో 50 శాతం ఫౌండేషన్‌కు కేటాయించిన భాస్కర్‌పై అసత్య ప్రచారాలా?

**ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న వ్యక్తిపై నిరాధార ఆరోపణలు మానుకోవాలి**

**ఫ్లోరోసిస్ సమస్య పరిష్కారానికి జిల్లా స్థాయి అఖిలపక్ష సమావేశం**

**పుట్టపాక ఉపసర్పంచ్ బండమీది కిరణ్**



**తొలి అక్షరం/చౌటుప్పల్ ప్రతినిధి. అక్టోబర్ 27:** చౌటుప్పల్: సమాజ సేవే లక్ష్యంగా పనిచేస్తూ, తాను సంపాదించిన ఆస్తిలో 50 శాతం ఈఎల్వీ ఫౌండేషన్‌కు కేటాయిస్తూ వీలునామా రాసిచ్చిన సామాజిక సేవకుడు, ఈఎల్వీ ఫౌండేషన్ చైర్మన్ ఈఎల్వీ భాస్కర్‌పై నిరాధార ఆరోపణలు చేస్తూ అసత్య ప్రచారాలకు పాల్పడటం మానుకోవాలని పుట్టపాక గ్రామ ఉపసర్పంచ్ బండమీది కిరణ్ హితవు పలికారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని ఈఎల్వీ ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మునుగోడు నియోజకవర్గవ్యాప్తంగా పేద ప్రజలకు అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఈఎల్వీ భాస్కర్‌పై కొందరు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడం విచారకరమన్నారు. వాస్తవాలను తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదని, ప్రజాసేవకు అంకితమైన వ్యక్తి సేవలను గుర్తించాలని సూచించారు. చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారుతున్న పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తూ వారి భవిష్యత్తుకు భాస్కర్ భరోసా కల్పిస్తున్నారని కిరణ్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు కుటుంబ సభ్యుడిలా అండగా నిలుస్తూ, వైద్య శిబిరాల నిర్వహణతో పాటు అవసరమైన వారికి ఆసుపత్రుల్లో చికిత్స అందేలా సహకరిస్తున్నారని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యక్తిపై విమర్శలు చేసే ముందు ఆయన చేస్తున్న సేవలను పరిశీలించాలని హితవు పలికారు. మునుగోడు నియోజకవర్గ ప్రజలను ఏళ్లుగా వేధిస్తున్న ఫ్లోరోసిస్ సమస్య పరిష్కారంపై ప్రజాప్రతినిధులు, నాయకులు మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కిరణ్ అన్నారు. జిల్లాస్థాయి నాయకులు ఉన్నప్పటికీ ఫ్లోరోసిస్ సమస్యపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు శివన్నగూడెం రిజర్వాయర్ పనులను పూర్తి చేయించేందుకు ఈఎల్వీ భాస్కర్ త్వరలో నల్లగొండ జిల్లా స్థాయి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తాను సంపాదించిన ఆస్తిలో 50 శాతం ఫౌండేషన్‌కు కేటాయిస్తూ వీలునామా రాసిచ్చిన భాస్కర్‌పై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని బండమీది కిరణ్ కోరారు. పేదలకు సహాయం చేయడం, విద్యార్థులకు అండగా నిలవడం, వైద్య సేవలు అందించడం వంటి కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతున్న వ్యక్తిపై నిరాధార ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. విమర్శలు చేసే వారు ముందుగా వాస్తవాలను తెలుసుకోవాలని, ప్రజాసేవ చేసే వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గుజ్జ గ్రామ ఉపసర్పంచ్ ఎలిజాల శ్రీను, ఫౌండేషన్ సభ్యులు పట్నం బాలకృష్ణ, ఓర్సు విజయ్, గండి సునీల్, పందుల రవితేజ, రాసమల్ల ముత్యాలు, కంచర్ల ప్రేమ్‌దాస్, సికిమెట్ల హేమేందర్, వీరస్వామి, ప్రశాంత్, మురళి, వంశీ, నరసింహ పాల్గొన్నారు.

# రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బ్యాగులు, బూట్ల పంపిణీ




**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 27:** తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా, రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు, బెల్టులు, బూట్లు మరియు సాక్సుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రముఖి జగదీష్ విద్యార్థులకు విద్యా సామగ్రిని (బ్యాగ్, బెల్టు, షూస్, సాక్స) అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఇలాంటి సంక్షేమ పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ వసతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచాల పంపిణీ

**- కార్మికుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం: ఎమ్మెల్యే రామచంద్రనాయక్**



**తొలిఅక్షరం /మరిపెడ అక్టోబర్ 27:** కల్లు గీత కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ అన్నారు. మంగళవారం మరిపెడ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాటి, ఈత చెట్లు ఎక్కే సమయంలో గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా రక్షక కవచాలు ఉపయోగపడతాయని తెలిపారు. కార్మికులు వీటిని సద్వినియోగం చేసుకొని సురక్షితంగా వృత్తిని కొనసాగించాలని సూచించారు. గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూ.30 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించాలి

**- రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి: సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్**




**తొలి అక్షరం / రామన్నపేట, అక్టోబర్ 27:** ఎల్నినో ప్రభావంతో రాబోయే వర్షాభావ, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణకు రూ. 30 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేసి, రైతులకు భరోసా కల్పించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. రామన్నపేటలో కల్లూరి నగేష్ అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల విస్తృత స్థాయి సమావేశంలో జహంగీర్ మాట్లాడుతూ, వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వాలు కార్యాచరణ రూపొందించాలని అన్నారు. కేంద్రంతో చర్చించి అవసరమైన నిధులు సాధించడంతోపాటు రాష్ట్ర బడ్జెట్‌లోనూ ప్రత్యేక నిధులు కేటాయించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి కొరత రాకుండా చెరువులు, బోరుబావులు, ఇతర నీటి వనరులను ముందుగానే సమీక్షించాలని కోరారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై స్పష్టమైన సూచనలు ఇవ్వడంతోపాటు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగునీటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, అవసరమైన ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద అదనపు పనిదినాలు కల్పించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పశువుల మేత, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిట్టకాల బోడు తండాలో నూతన పంచాయతీ భవనానికి ఏర్పాట్లు

**- జేసీబీతో స్థలాన్ని చదును చేయించిన సర్పంచ్ సూర్య భాయ్ నాయక్**




**తొలి అక్షరం / నెక్కొండ, అక్టోబర్ 27:** నెక్కొండ మండలం పిట్టకాల బోడు తండా గ్రామపంచాయతీకి నూతన భవనం నిర్మించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవతో భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. భూమిపూజకు సన్నాహాల్లో భాగంగా సర్పంచ్ బాదావత్ సూర్య భాయ్ నాయక్ జేసీబీతో స్థలాన్ని శుభ్రం చేయించి, చదును చేసే పనులను ప్రారంభించారు. త్వరలో భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాంబరాజు, వార్డు సభ్యుడు బదావత్ నెహ్రూ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చామకూరి అజేయుడు ఏకగ్రీవ ఎన్నిక



**తొలి అక్షరం / నెక్కొండ, అక్టోబర్ 27:** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామానికి చెందిన చామకూరి అజేయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అజేయుడు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగులను వేధింపులకు గురిచేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తానన్నారు. సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ఏలినో ప్రభావంపై నీర్నెములలో ప్రత్యేక గ్రామసభ



**రామన్నపేట, అక్టోబర్ 27 (తొలి అక్షరం):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నెముల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏలినో ప్రభావంతో ఎదురయ్యే సమస్యలపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ కందిమల్ల గోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాబోయే ఎనిమిది నెలల్లో కరువు, నీటి కొరత, పంట నష్టాలు, విద్యుత్ సమస్యలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని గ్రామస్తులకు సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల మునగ పంటను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారి ఎజాజ్ అలీ ఖాన్ కోరారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేందుకు ప్రతి ఇంటి వద్ద, పొలాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులు సూచించారు. తాగునీటి వృథాను అరికట్టడంతోపాటు, పంటలకు నీటి పొదుపు పద్ధతులు పాటించాలని, అనవసర విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. ఎండ తీవ్రత నుంచి మనుషులు, పశువులను కాపాడుకునే మార్గాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఎం.డి. రఫీ, డిప్యూటీ తహసీల్దార్ శైలజ, ఏపీఓ వెంకన్న, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.



# సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పోతుల యాదగిరి మృతికి దైద రవీందర్ నివాళి

**తొలి అక్షరం /రామన్నపేట, అక్టోబర్ 27:** నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని ఆఫీసర్ కాలనీకి చెందిన ఆత్మీయ మిత్రుడు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోతుల యాదగిరి అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ వెంటనే వారి నివాసానికి చేరుకున్నారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గార్లపాటి రవీందర్ రెడ్డి, బిక్షం, లతీఫ్, అంజయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి పాఠశాలలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు




**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 27:** న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు బచ్‌పన్ బచావో ఆందోళన్ కార్యక్రమంలో భాగంగా రామన్నపేటలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో "కానూన్ జానో బచ్‌పన్ బచావో" పేరుతో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వి. రత్నకుమారి 740 మంది విద్యార్థులకు మంచి స్పర్శ, చెడు స్పర్శ, పోక్సో చట్టం, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బాలలు తమకు ఎదురయ్యే అనుచిత ప్రవర్తనను గుర్తించి, ధైర్యంగా పెద్దలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు కునూరు శ్రీనివాస్, మామిడి వెంకట్‌రెడ్డి, కె. శ్రీశైలం, కె. యాదయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్, కరస్పాండెంట్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో కిలో గంజాయి పట్టివేత

**- బీహార్ యువకుడి అరెస్ట్**



**తొలి అక్షరం / షాద్‌నగర్, అక్టోబర్ 27:** షాద్‌నగర్‌లో గంజాయి విక్రయిస్తున్న బీహార్‌కు చెందిన సంజయ్ కుమార్ (23)ను శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆఫీసర్స్ కాలనీలోని అతడి నివాసంపై దాడి చేసి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి స్థానిక యువతకు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దందాలో మరెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# జెడ్‌పిహెచ్‌ఎస్ కొమ్మాయిగూడెంలో బందా బాలరాజు కి ఘనంగా వీడ్కోలు సన్మానం



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 27:** జెడ్ పి హెచ్ ఎస్ కొమ్మాయిగూడెంలో ప్రధానోపాధ్యాయులు ఎం. మురళీధర్ అధ్యక్షతన స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) బందా బాలరాజు పదవీ విరమణ సన్మాన సభ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథి సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ - ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల కన్నా గొప్పది, విద్యార్థులకు దిశానిర్దేశం చేసే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. మండల విద్యాధికారి తంగెళ్ల సురేందర్ రెడ్డి మాట్లాడుతూ బాలరాజు అందరి మన్ననలు పొందారని కొనియాడారు. విశిష్ట అతిథి రెవరెండ్ బిషప్ డా. భాగ్యం మాట్లాడుతూ విద్యార్థులు బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సఫియా బేగం, కోట విజయ వెంకన్న, మందడి శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసచారి, గడ్డం శ్రీను, సమీన్, ఉపసర్పంచ్ తీర్పాల ఐలయ్య, మాజీ ఉపసర్పంచ్ కునూరు కృష్ణ, వార్డు సభ్యులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, బంధుమిత్రులు పాల్గొన్నారు. సమన్వయకర్తలుగా కోట విజయ వెంకన్న, గడ్డం శ్రీను వ్యవహరించారు.

# డ్రగ్స్‌కు నో చెప్పండి.. సురక్షిత భవిష్యత్తు కోసం పరుగెత్తండి

- **29న రామన్నపేటలో 2కే రన్**
- **యువత, విద్యార్థులు, ప్రజలు పాల్గొనాలి: ఎస్ ఐ గోపాతి సతీష్**



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 27:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, సీఐ మెలుగు రవి సహకారంతో ఈ నెల 29న రామన్నపేటలో 2కే రన్ నిర్వహించనున్నట్లు ఎస్ ఐ గోపాతి సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 6 గంటలకు రామన్నపేటలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నుంచి రన్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలనే లక్ష్యంతో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేలా ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని 2కే రన్‌ను విజయవంతం చేయాలని ఎస్ ఐ గోపాతి సతీష్ పిలుపునిచ్చారు

# విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన అవసరం

- **బాలల రక్షణకు చట్టాలపై అవగాహన ముఖ్యం**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 27:** విద్యార్థులు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ డి. ప్రవీణ్ కుమార్ సూచించారు. మంగళవారం మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎస్. స్వాతిరెడ్డి ఆదేశాల మేరకు షాద్‌నగర్ నియోజకవర్గంలోని కిషన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలబాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టేందుకు పోక్సో చట్టం రూపొందించారని తెలిపారు. విద్యార్థులు ఈ చట్టంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, ఉపాధ్యాయులు కూడా చట్టంలోని అంశాలను తెలుసుకోవాలని సూచించారు. బాలల రక్షణకు చట్టాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు టి. ఆంజనేయులు గౌడ్, నరేంద్రనాథ్, బి. రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ప్రస్తుత పంటను కాపాడాలి.. యాసంగిలో వరి సాగు వద్దు!

**- రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలి: మంత్రి తుమ్మల**






**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి అక్టోబర్ -27:** ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో ప్రస్తుత వానాకాలం పంటను కాపాడాలని, యాసంగిలో వరికి బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది జూలై వరకు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంకుడు గుంతలు, వ్యవసాయ కుంటల ద్వారా నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, పశుగ్రాసం కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పత్తి, ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షిస్తూ రైతులకు న్యాయం చేయాలని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో పది మండలాల్లో తీవ్ర కరువు, ఏడు మండలాల్లో సాధారణ కరువు పరిస్థితులు ఉన్నాయని కలెక్టర్ దివాకర టీఎస్ వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భూగర్భ జలమట్టాలు సుమారు 3.5 మీటర్లు తగ్గాయని కలెక్టర్ అంకిత్ తెలిపారు. సమీక్షలో ప్రజాప్రతినిధులు, శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**• ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు స్థానిక కేంద్రాల్లోనే అందుబాటులో ఉండాలి: డీపీఓ వినోద్ కుమార్**

**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి అక్టోబర్ -27:**

అర్ణవ్ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు స్థానిక కేంద్రాల్లోనే అందుబాటులో ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి జి. వినోద్ కుమార్ ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అధికారులకు సెలవులు అనుమతించబోమని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాలు, పాత మట్టి ఇళ్లలో నివసించే వారిని గుర్తించి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, తాగునీటి ట్యాంకులకు సూపర్ క్లోరినేషన్ చేయించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీటి సరఫరా, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. తెగిపడిన విద్యుత్ తీగలు, విరిగిన చెట్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని డీపీఓ వినోద్ కుమార్ తెలిపారు.

## రాబోయే 2-3 రోజులలో చేపల వేటకు వెళ్లకూడదు.. మత్స్య శాఖ సహాయ సంచాలకులు మల్లేశం

**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి అక్టోబర్ -27:** తెలంగాణ వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, రాబోయే రెండు మూడు రోజులలో బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం "ఆర్నబ్" తుఫాన్‌గా మారి అతివేగవంతమైన ఈదురుగాలులతో ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లాలోని మత్స్యకారులు రిజర్వాయర్లలో, వాగులలో చేపల వేటకు వెళ్లరాదని మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఏ. మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే రెండు మూడు రోజులలో జిల్లాలో కురిసే భారీ వర్షాల వల్ల నదులు, వాగులు, వంకలలో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని, రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున, చేపల వేటకు వెళితే ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని, కావున జిల్లాలోని మత్స్యకారులు ఎవరూ ప్రాణాపాయ పరిస్థితుల్లో రిజర్వాయర్లు, వాగులు, చెరువులలో చేపల వేటకు వెళ్లరాదని మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ధంసలాపురం చెరువులో గుర్రపుడెక్క తొలగింపునకు ప్రత్యేక యంత్రంతో చర్యలు

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**చెరువు శుభ్రపరిచే పనులను వేగవంతంగా పూర్తి చేయాలి**





**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి అక్టోబర్ -27:** స్థానిక ధంసలాపురం చెరువులో విస్తరించిన గుర్రపుడెక్క మొక్కలను ప్రత్యేక యంత్రం ద్వారా తొలగింపును జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, చెరువులో నీటి ఉపరితలంపై పెద్దఎత్తున విస్తరించిన గుర్రపుడెక్క, ఇతర జలకలుపు మొక్కలను తొలగించేందుకు అక్వాటిక్ వీడ్ హార్వెస్టర్ అనే ప్రత్యేక యంత్రాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ యంత్రం ద్వారా గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియ వేగవంతంగా సాగడంతో పాటు, మానవ శ్రమ కూడా తగ్గుతుందని తెలిపారు. చెరువుల్లో గుర్రపుడెక్క అధికంగా విస్తరించడం వల్ల నీటి ఉపరితలంపై సూర్యరశ్మి ప్రసరణ తగ్గుతుందని, నీటిలో ఆక్సిజన్ స్థాయులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. చెరువుల్లో గుర్రపుడెక్కను తొలగించడం ద్వారా నీటి పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు, జలవనరులను పరిశుభ్రంగా ఉంచేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారులు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, గుర్రపుడెక్క తొలగింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఏ. మల్లేశం, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, మున్సిపల్ కార్పొరేషన్ డీఈ నవ్యజ్యోతి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఏడాది ఖమ్మం జిల్లా ఆదాయ లక్ష్యం రూ.59 వేల కోట్లు

**• వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ: ఎస్పీ టక్కర్**




**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి అక్టోబర్ -27:** ఖమ్మం జిల్లా ఆర్థిక వ్యవస్థను వచ్చే ఏడాది నాటికి రూ.59 వేల కోట్లకు చేర్చే లక్ష్యంతో సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జీఎఫ్‌ఎస్‌టీ వైస్ చైర్మన్ ఎస్పీ టక్కర్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా అభివృద్ధి ప్రణాళికపై నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో రైతుల ఆదాయం పెంచడంతోపాటు పరిశ్రమలు, సేవా రంగాలను విస్తరించాలని సూచించారు. జిల్లాలో పెట్టుబడులను త్వరితగతిన కార్యరూపంలోకి తీసుకురావాలని, పరిశ్రమల ఏర్పాటుకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు శిక్షణ, రుణాలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి ఆదాయం, ఉపాధి అవకాశాలు పెంచాలని తెలిపారు. ఖమ్మం ఐటీ టవర్‌లో ఉద్యోగ అవకాశాలను పెంచడంతోపాటు రెండో ఐటీ టవర్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణ, ఉద్యాన పంటలు, పశుసంవర్ధక, మత్స్య రంగాలను ప్రోత్సహించి గ్రామీణ కుటుంబాల ఆదాయం పెంచాలని అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన 11 బృందాలు స్పష్టమైన లక్ష్యాలతో కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నెల్లికుదురులో రూ.7.50 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు శంకుస్థాపన

**• ఒకే ప్రాంగణంలో ఇంటర్ వరకు నాణ్యమైన విద్య**



**తొలి అక్షరం / నెల్లికుదురు అక్టోబరు 27:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో రూ.7.50 కోట్లతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనానికి ప్రజాప్రతినిధులు, అధికారులు శంకుస్థాపన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 122 పాఠశాలల్లో తొలి శంకుస్థాపన నెల్లికుదురులోనే జరిగినట్లు రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి తెలిపారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్య అందించేలా డిజిటల్ తరగతులు, ఆధునిక భోజనశాల, క్రీడా మైదానాలతో పాఠశాలను నిర్మించనున్నట్లు కలెక్టర్ స్నేహ శబరీష్ వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ మాట్లాడుతూ నెల్లికుదురులో రహదారులు, సెంట్రల్ లైటింగ్, గెస్ట్‌హౌస్, అంబేద్కర్ కూడలి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రంగస్వామి దేవాలయ అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరు చేయనున్నట్లు వేం నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం కేసముద్రం మండలం మహమూద్‌పట్నంలోని కేజీబీవీ జూనియర్ కళాశాల భవన ఉన్నతీకరణ పనులను ప్రారంభించి, తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వసతి గదులను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేసి, నాణ్యతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్, ఎస్పీ డాక్టర్ శబరీష్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# హత్య, అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**తొలి అక్షరం / వలిగొండ, అక్టోబర్ 27:**

వలిగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన హత్య, అత్యాచారం కేసులో నిందితుడు చిన్నపాక రవితేజకు నల్గొండ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. అక్టోబర్ 26, 2026న వెలువడిన తీర్పులో హత్య కేసుకు జీవిత ఖైదు, ఇతర నేరాలకు జైలు శిక్షలతో పాటు జరిమానాలు విధించింది. కేసు విచారణలో సహకరించిన దర్యాప్తు అధికారులు, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, ఐపీఎస్ అభినందించారు.

# కళాకారులకు ఘన సన్మానం




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 27:** లయన్స్ క్లబ్ తొర్రూరు వినాయక ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ వనం మోహన్ అధ్యక్షతన అంతర్జాతీయ కళాకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ కళారంగాలకు చెందిన కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజియన్ చైర్‌పర్సన్ లయన్ డాక్టర్ నాగవాణి, రీజియన్ సెక్రటరీ లయన్ తుమ్మూరు శ్రీదేవి రెడ్డి లు హాజరై కళాకారులను సత్కరించారు. సన్మాన గ్రహీతలుగా మిమిక్రీ కళాకారుడు, ఈవెంట్ ఆర్గనైజర్ లయన్ పారిపల్లి శ్రావణ్ కుమార్, శాస్త్రీయ నృత్య కళాకారిణి నాగపూరి కీర్తన, పేరిణి నాట్య కళాకారుడు రాజేందర్, కూచిపూడి నృత్య కళాకారిణి కుమారి లాస్వితలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారులు తమ ప్రతిభతో ప్రజలకు వినోదాన్ని అందించడమే కాకుండా, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కళాకారులను గుర్తించి, గౌరవించడం ద్వారా వారిలో మరింత స్ఫూర్తిని నింపవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో చార్టర్డ్ ప్రెసిడెంట్ లయన్ కందకట్ల సోమశేఖర్, పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ పద్మం యాదగిరి, ఇమిడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ తల్లాడి హీరాధర్, సెక్రటరీ లయన్ శ్రావణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లు లయన్ బుదారపు శ్రీనివాస్, లయన్ రాగి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి లయన్ కందకట్ల సులోచన, సహాయ కోశాధికారి లయన్ పద్మం అనురాధ, లయన్ మార్గం హరిప్రసాద్, ఎనగందుల మురళి, లయన్ కొండ్ల ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 30న పట్టుబడిన వాహనాల వేలం


పత్రికా ప్రకటన

తేది: 26.10.2026 రోజున తెలియజేయునది ఏమనగా, H.Datthu Raj Goud, డిప్యూటీ కమిషనర్ Proh .& ఎక్సైజ్ వరంగల్ డివిజన్ గారి ఆదేశానుసారం, P. Karam Chand, జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి, మహబూబాబాద్ గారి ఆధ్వర్యంలో B.Ashok P&EI, SHO తొర్రూర్ గారి ఆధ్వర్యంలో తేది. 30.10.2026 (Friday) రోజున ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్: తొర్రూర్ నందు వివిధ నేరాల పై పట్టుబడిన వాహనాలకు వేలం వేయటం జరగనునంది కావున ఆసక్తి కలిగినవారి తేది: 30.10.2026 ఉదయం 09:00 గంటలకు ఎక్సైజ్ స్టేషన్ తొర్రూర్ వద్దకు వచ్చి 50% దరవత్తు చెల్లించి వేలం నందు పాల్గొనగలరు.

Station House Officer
P&E Station Thorrur

iQOO Z10R 26mm f/1.79 1/33s ISO296 10/26/2026, 16:40

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 27:** గుడుంబా సంబంధిత కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 30న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ బూస అశోక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తొర్రూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలను ఈనెల 30(శుక్రవారం) ఉదయం 9 గంటలకు వేలం వేస్తామని తెలిపారు. వరంగల్ డిప్యూటీ కమిషనర్ దత్తు రాజు గౌడ్ ఆదేశానుసారం జిల్లా సూపరింటెండెంట్ పి. కరమ్ చంద్ సమక్షంలో వేలం వేస్తామని సీఐ బి.అశోక్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగే ఈ బహిరంగ వేలంలో ఆసక్తి కలవారు ముందస్తుగా 50 శాతం డిపాజిట్ చెల్లించి అర్హత కలిగిన గుర్తింపు పత్రాలతో వేలంలో పాల్గొనవచ్చునని వెల్లడించారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలపై రాజ్యసభలో గళమెత్తుతా...

- అవసరమైతే ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంతో చర్చిస్తా..
- ఎంపీ ఒద్దిరాజు రవిచంద్రకు వినతిపత్రం అందజేసిన ఎన్‌హెచ్‌ఎం జేఏసీ మహబూబాబాద్ జిల్లా కమిటీ



**తొలి అక్షరం/ఇనుగుర్తి అక్టోబర్ 27:** ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను రాబోయే పార్లమెంటు సమావేశాల్లో రాజ్యసభలో ప్రస్తావిస్తానని రాజ్యసభ సభ్యుడు ఒద్దిరాజు రవిచంద్ర హామీ ఇచ్చారు. ఎన్‌హెచ్‌ఎం జేఏసీ మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మంలోని ఆయన నివాసంలో ఉద్యోగుల ప్రతినిధులు ఎంపీని కలిసి 16 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో గత 15 రోజులుగా సమ్మె చేస్తున్న ఉద్యోగుల సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో మాట్లాడి సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో ఫోన్‌లో మాట్లాడి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి త్వరలోనే ఆలోచిస్తానని మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు మంత్రిని కలిసేందుకు సమయం కేటాయించేలా చొరవ తీసుకున్నారు. రెండు, మూడు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కార దిశగా స్పందించకపోతే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని ఎంపీ రవిచంద్ర హామీ ఇచ్చారు. అవసరమైతే ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర కమిటీని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానని స్పష్టం చేశారు.

# నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్

- పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి.
- సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, సీసీటీఎన్ఎస్ ఆన్‌లైన్ సేవల నిర్వహణపై సూచనలు - గంజాయి, గుడుంబా అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలి



**తొలిఅక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 27:** నెల్లికుదురు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్, నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్‌లోని విధుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, సాంకేతిక వ్యవస్థల వినియోగం, నేర నియంత్రణ చర్యలపై ఎస్సై కరుణాకర్ ను అడిగి పలు సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరు, వాటి నిరంతర పర్యవేక్షణ, పై ఆరా తీశారు. పోలీస్ సిబ్బంది తమకు కేటాయించిన విధులను, బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఎస్పీ సూచించారు. గ్రామాల సందర్శనలను క్రమం తప్పకుండా చేపడుతూ, స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, ప్రజలతో సమన్వయం పెంపొందించుకోవాలని తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్నపరిణామాలపై నిరంతరం నిఘా ఉంచి శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. సీసీటీఎన్ఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న పోలీస్ సేవలు, కేసుల నమోదు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ పోలీస్ సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా అందించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగం, గుడుంబా తయారీ మరియు విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమానిత వ్యక్తుల కదలికలను నిశితంగా పరిశీలిస్తూ, పాత నేరస్థులు, పునరావృత నేరాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తూ, అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు సమర్థవంతమైన తనిఖీలు చేపట్టాలని తెలిపారు. నేరాల నియంత్రణ, అక్రమ రవాణా నిరోధం, ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ ప్రజలకు భద్రతాభావాన్ని కల్పించాలని ఎస్పీ ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ సూచించారు.

# హనుమకొండలో బార్బెక్యూ నేషన్ నూతన రెస్టారెంట్ ప్రారంభం

- మల్లికాంబ మనోవికాస కేంద్రం విద్యార్థుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం




**తొలి అక్షరం/హనుమకొండ ప్రతినిధి:** హనుమకొండ నక్కలగుట్టలోని కపిల్ కాకతీయ టవర్స్ మొదటి అంతస్తులో బార్బెక్యూ నేషన్ నూతన రెస్టారెంట్‌ను మల్లికాంబ మనోవికాస కేంద్రం విద్యార్థుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ అసిస్టెంట్ ప్రాంతీయ మేనేజర్ ముత్తులూరి నరేష్ నాయుడు మాట్లాడుతూ.. శాఖాహార, మాంసాహార వంటకాలతో 70కి పైగా రకాల వంటకాలను అపరిమిత విందుగా అందిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ వేడుకలు, పుట్టినరోజులు, స్నేహితుల సమావేశాలకు ఈ రెస్టారెంట్ అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. విందు ధరలు: సోమవారం నుంచి శనివారం వరకు శాఖాహారం రూ.749, మాంసాహారం రూ.799. ఆదివారం శాఖాహారం రూ.849, మాంసాహారం రూ.899గా నిర్ణయించినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు

- రక్తదానంతో మానవత్వానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత





**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం 2026 ను పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో 101 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. స్వయంగా రక్తదానం చేసి అందరికీ స్ఫూర్తిగా నిలిచిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సమాజ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయాలనే గొప్ప సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అదనపు డీసీపీలు సురేష్, వి.శ్రీనివాస్, ఏసీపీలు మధుసూదన్, నరసింహారావు, సత్యనారాయణ, ఏఆర్ ఏసీపీలు నాగయ్య, అనంతయ్య, సురేంద్ర, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, రెడ్ క్రాస్ జిల్లా పాలక మండలి సభ్యులు కె.రాకేష్ రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. **మామిండ్ల సురేష్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా 15 మంది యువకులు** రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండల సభ్యులు ఇవి శ్రీనివాస్ రావు సుబేదారి సీఐ రంజిత్ కుమార్, ఎస్ఐ పాణి ఆదేశాలు, సూచనల మేరకు డిసిసి కార్యవర్గ సభ్యులు మామిండ్ల సురేష్ ఆధ్వర్యంలో సుమారు 15 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే కాదుఒఆపదలో ఉన్నవారికి రక్తదానం ద్వారా ప్రాణదానం చేయడం నిజమైన మానవత్వం అని రక్తదానం, ప్రాణదానం అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి!

# సేవకు గౌరవం.. పండగకు నూతన శోభ!

- 210 మంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ
- సేవా భావంతో ఇతరులకు మేలు చేయాలి: ఏసీపీ లక్ష్మీనారాయణ
- సమాజ్ సేవలను అభినందించిన మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్





**తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 27:** పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు దసరా, దీపావళి పండగల సందర్భంగా రాజస్థానీ మార్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. మంగళవారం షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 110 మంది మహిళా కార్మికులు, 100 మంది పురుష కార్మికులు కలిపి మొత్తం 210 మందికి పండగ కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏసీపీ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, సీఐ సీతారాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, సేవా భావంతో చేసే కార్యక్రమాలు ఇతరులకు మేలు చేస్తాయని, ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంత సహాయం అందించాలని సూచించారు. కార్మికుల సేవలను గుర్తించి పండగ వేళ కొత్త దుస్తులు అందించడం అభినందనీయమన్నారు. మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషించే కార్మికులను గౌరవించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. రాజస్థానీ మార్వాడీ సమాజ్ సేవలను అభినందించారు. సమాజ్‌కు చెందిన సుమారు 30 మంది దాతలు ఒక్కొక్కరు రూ.6,000 చొప్పున విరాళాలు అందించగా, మొత్తం రూ.1.80 లక్షలు సమకూరాయి. వారి సహకారంతో కార్మికులకు పండగ కానుకలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నిర్వాహకులు రాద్యే శ్యామ్ గౌర్, భావన్లాల్ చౌదరి, కైలాష్ చౌదరి, రాజు కుమావత్, పలువురు సంఘ పెద్దలు, కౌన్సిలర్లు పెంటయ్య, రాజు నాయక్, గోపాల్, అశోక్, దాతలు, వివిధ సంస్థల ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# మైనర్లకు వాహనాలిస్తే చర్యలు

- తొర్రూరు సీఐ గణేష్, ఎస్సై మహేందర్ రెడ్డి






**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ వస్తం) అక్టోబర్ 27:** మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ గణేష్, ఎస్సై మహేందర్ రెడ్డి లు తెలిపారు. సీఐ గణేష్, ఎస్సై మహేందర్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో మంగళవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. తొర్రూరు పట్టణంలోని అన్నారం రోడ్డులో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఎండి అసిఫ్ అనే 15 ఏళ్ల మైనర్ బాలుడిని హెడ్ కానిస్టేబుల్ జె. రవీందర్ గుర్తించి వారి ఇంటికి తీసుకువెళ్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మరో మారు బాలునికి ద్విచక్ర వాహనం ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిఐ, ఎస్ఐ లు మాట్లాడుతూమైనర్లు సరదా కోసం ద్విచక్ర లేదా ఇతర వాహనాలు నడిపితే ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులు, తల్లిదండ్రులపై కఠినమైన చర్యలు తీసుకోవడమే కాకుండా భారీ జరిమానా, జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారికి వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. 18 ఏళ్లలోపు వారు బండి నడపడం నిబంధనలకు విరుద్ధమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు వాహనాలు నడుపుతున్నారని సంబరపడిపోతున్నారుకానీ ప్రమాదాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. పోలీసుల తనిఖీల్లో డ్రైవింగ్ చేస్తూ చాలా మంది మైనర్లు పట్టుబడుతున్నారన్నారు.

# కాచికల్‌మేచరాజపల్లి రహదారి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

- రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన సర్పంచి ఉషా అశోక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎదల్ల యాదవ రెడ్డితో కలిసి వినతి



**తొలి అక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 27:** మహబూబాబాద్ జిల్లా, నెల్లికుదురు: మండలంలోని కాచికల్ నుంచి రామానుజాపురం, ఎర్రబెల్లిగూడెం మీదుగా మేచరాజపల్లికి వెళ్లే రహదారి నిర్మాణ పనులను వెంటనే చేపట్టి, ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఎర్రబెల్లిగూడెం సర్పంచి ఉషా అశోక్ కోరారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎదల్ల యాదవ రెడ్డితో కలిసి రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. తొర్రూరుమానుకోట ప్రధాన రహదారిలోని కాచికల్ స్టేజి నుంచి ప్రారంభమయ్యే ఈ రహదారి పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా మారిందని సర్పంచి ఉషా అశోక్ తెలిపారు. రహదారిపై ప్రయాణించేందుకు వాహనదారులు, గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# ఉపాధి హామీలో రికార్డు పనిదినాలు కల్పించాలి

- నీటి సంరక్షణ, గ్రామీణ రహదారులకు ప్రాధాన్యం
- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి: ఎమ్మెల్యే శంకర్



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 27:** ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో పనిదినాలు కల్పించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అధికారులను ఆదేశించారు. ఫరూఖ్‌నగర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఉపాధి హామీ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఉపాధి కల్పనతో పాటు గ్రామాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తుల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపునకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. రాబోయే ఐదారు నెలల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం చేసేందుకు మట్టి రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చింతగూడకు ఆర్టీసీ బస్సు.. ఐదేళ్ల నిరీక్షణకు తెర

- చింతగూడ గ్రామానికి బస్సు సౌకర్యం.. గ్రామస్థుల హర్షం
- ఎమ్మెల్యే చొరవతో చింతగూడకు ఆర్టీసీ బస్సు ప్రారంభం



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 27:** ఫరూఖ్‌నగర్ మండలం చింతగూడ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఐదేళ్లుగా బస్సు లేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్థుల చిరకాల కోరిక నెరవేరింది. సర్పంచ్ నరేష్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్ మంగళవారం నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. బస్సు సౌకర్యంతో విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, వృద్ధులకు ప్రయాణ కష్టాలు తొలగనున్నాయి. పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగాలు, ఇతర అవసరాల కోసం పట్టణాలకు వెళ్లేవారికి ఈ సర్వీసు ఉపయోగపడనుంది. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు చొరవ తీసుకున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శంకరయ్య, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రతి సొసైటీకి కొత్త పంట రుణాల కింద రూ.10 లక్షలు

- బ్యాంకు రూ.10.23 కోట్ల నికర లాభం.. సభ్య సంఘాలకు రూ.1.53 కోట్ల డివిడెండ్



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజనసభ సమావేశంలో ప్రతి సొసైటీకి కొత్త పంట రుణాల కింద రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, డీసీసీబీ పర్సన్-ఇన్-ఛార్జి కమిటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి ప్రకటించారు. 202526 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ.10.23 కోట్ల నికర లాభం సాధించగా, సభ్య సహకార సంఘాలకు రూ.1.53 కోట్ల డివిడెండ్ ప్రకటించారు. అర్హత కలిగిన సొసైటీలకు రూ.50 లక్షల వరకు, ఇతర అర్హతగల సంఘాలకు రూ.30 లక్షల వరకు దీర్ఘకాలిక రుణాల సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. రుణ బకాయిదారులకు ఉపశమనం కల్పించేందుకు ఒకేసారి పరిష్కార పథకాన్ని 2027 మార్చి 31 వరకు పొడిగించారు. బ్యాంకు శాఖల విస్తరణ, సహకార సంఘాల ఆర్థిక బలోపేతం, రుణాల వసూళ్లు, రైతులకు మెరుగైన సేవలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, బ్యాంకు అధికారులు, సహకార సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

**తొలి అక్షరం / షాద్‌నగర్, అక్టోబర్ 27:** బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని 12వ వార్డు కౌన్సిలర్ దిలీప్ కుమార్ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం-11లో చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణకు కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్యారాణి, ప్రతినిధులు, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఉమ్మడి వరంగల్ పర్యాటక సర్క్యూట్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు

- 'ది వీక్ హెరిటేజ్ అవార్డ్స్2026'లో సిల్వర్ బన్యన్ పురస్కారం




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణలోని వరంగల్, హనుమకొండ, ములుగు పర్యాటక సర్క్యూట్‌కు 'ది వీక్ హెరిటేజ్ అవార్డ్స్2026'లో వారసత్వ పర్యాటక విభాగంలో సిల్వర్ బన్యన్ అవార్డు లభించింది. అక్టోబర్ 27న న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ పర్యాటక సర్క్యూట్‌లో వరంగల్ కోట, కాకతీయ కళాతోరణం, వేయి స్తంభాల గుడి, భద్రకాళి దేవాలయం, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, లక్నవరం సరస్సు, బొగత జలపాతం వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. కాకతీయుల చారిత్రక వైభవం, ప్రకృతి అందాలు, గిరిజన సంస్కృతి, చేనేత సంప్రదాయాలను ఒకే పర్యాటక మార్గంలో అనుసంధానించడం ఈ అవార్డుకు ప్రత్యేకతగా నిలిచింది. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పర్యాటక సౌకర్యాల అభివృద్ధి, హోటళ్లు, బోటింగ్, రవాణా సదుపాయాల మెరుగుదలతో పాటు ప్రత్యేక పర్యాటక ప్యాకేజీల రూపకల్పన చేపడుతున్నారు. ఈ పురస్కారంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ పర్యాటకానికి మరింత గుర్తింపు లభించనుంది.

# చట్టాలపై అవగాహనతో బాల్యాన్ని కాపాడుకుందాం

- వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ





**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** బాలల హక్కుల పరిరక్షణ, వేధింపుల నివారణ లక్ష్యంగా వరంగల్ జిల్లాలో నిర్వహిస్తున్న 'సురక్షిత బచ్‌పన్ అభియాన్'లో భాగంగా కరీమాబాద్, శంభునిపేట, ఉర్సుగుట్టలోని పలు పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి కందుకూరి పూజ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా వంటి సమస్యల నుంచి పిల్లలను రక్షించేందుకు చట్టాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వేధింపులకు గురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. బాధితులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని పేర్కొన్నారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బాలల సహాయ నంబరు 1098, పోలీసు అత్యవసర నంబరు 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ సహాయ న్యాయవాది పి. శ్రీనివాస రావు, పోలీసు అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నయవంచనను పట్టభద్రులు తిప్పికొట్టాలి: ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



- కోస్గిలో పట్టభద్రుల ఓటు నమోదు సన్నాహక సమావేశం

**తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 27:** పట్టభద్రుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి విమర్శించారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 6లోపు పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు సకాలంలో విడుదల చేయక విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. పట్టభద్రులు తమ సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, పట్టభద్రులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అగ్గనూరు కుటుంబ ఆత్మీయతకు ముగ్ధుడైన ఎమ్మెల్యే శంకర్

- చిన్నారి మాన్వి భరతనాట్యానికి ఫిదా.. పెద్దలకు పాదాభివందనం చేసిన ఎమ్మెల్యే



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 27:** షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ నివాసంలో మంగళవారం సాయంత్రం ఆత్మీయ టీ పార్టీ సందడిగా సాగింది. షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అగ్గనూరు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో సరదాగా ముచ్చటించారు. కుటుంబ సభ్యులంతా ఒకే చోట కలిసి మెలిసి ఉండటం, పరస్పర అనుబంధాలను చూసి ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల ఉద్యోగాలు, చదువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అగ్గనూరు బసవేశ్వర్ సోదరుడి కుమార్తె చిన్నారి మాన్వి ప్రదర్శించిన భరతనాట్యం ఎమ్మెల్యేను ఆకట్టుకుంది. చిన్నారి ప్రతిభను అభినందించిన శంకర్ ఆమె ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. అనంతరం బసవేశ్వర్ తల్లికి పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. పెద్దలను గౌరవిస్తూ ఎమ్మెల్యే చూపిన నిరాడంబరత అక్కడున్నవారిని ఆకట్టుకుంది. తన నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా గడపడం పట్ల మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ సంతోషం వ్యక్తం చేశారు. రాజకీయ బాధ్యతలకు అతీతంగా కుటుంబ బంధాలు, పెద్దల ఆశీస్సులు, చిన్నారుల ప్రతిభకు ప్రాధాన్యమిస్తూ సాగిన ఈ కలయిక ఆహ్లాదకరంగా ముగిసింది.

# ఆర్టీసీ అభివృద్ధి సిబ్బంది సమిష్టి కృషితోనే సాధ్యం

- మేడిపల్లి సీఐ జలంధర్‌రెడ్డి
- చెంగిచెర్ల డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ
- ప్రమాదరహిత రవాణా, ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పిలుపు

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),అక్టోబర్ 27:** ప్రతి ఉద్యోగి అంకితభావంతో, సమిష్టి కృషితో పనిచేసినప్పుడే ఆర్టీసీ సంస్థ సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని మేడిపల్లి సీఐ డి. జలంధర్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల టీజీఎస్ ఆర్టీసీ డిపోలో సంస్థ అభివృద్ధికి విశేషంగా కృషి చేసి ఆదర్శంగా నిలిచిన సిబ్బందిని ఘన సన్మానించారు.

ఈ సందర్భంగా సీఐ జలంధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఏ సంస్థ మనుగడకైనా నిజాయితీగా విధులు నిర్వర్తించే సిబ్బందే అసలైన బలమన్నారు. ప్రయాణికులకు సురక్షితమైన, ప్రమాదరహిత రవాణా సౌకర్యాన్ని అందించినప్పుడే ప్రజల్లో ఆర్టీసీపై విశ్వాసం మరింత



ఇనుమడిస్తుందని పేర్కొన్నారు. సంస్థ ఆర్థిక పురోగతికి అత్యంత కీలకమైన ఇంధన పొదుపు విషయంలో ప్రతి ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నడుచుకుంటే ఆర్టీసీని తిరుగులేని సంస్థగా నిలబెట్టవచ్చని తెలిపారు. అనంతరం సంస్థకు వన్నెతెచ్చిన ఆదర్శ ఉద్యోగులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి సీఐ ఉదయ్‌భాస్కర్, డిపో మేనేజర్ స్వాతి, డిపో సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పిల్లల భద్రతకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి బాలభాస్కర్
- రక్షణ, భరోసా..మహిళాకు షీ టీమ్స్ నిరంతరం సేవలు
- జిల్లా పోలీసు అధికారి ప్రియాంక, మేడిపల్లి పోలీస్ స్టేషన్ సీఐ డి. జలేందర్ రెడ్డి
- బోడుప్పల్ జడ్పీ పాఠశాలలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు), అక్టోబర్27:** చిన్నారులు, విద్యార్థులకు పోక్సో చట్టంపై పూర్తి అవగాహన కల్పించే దిశగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి బాలభాస్కర్ సూచించారు.మంగళవారం బోడుప్పల్ జిల్లా పరిషత్ పాఠశాలలో పోక్సో చట్టం2012పై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి బాలభాస్కర్, జిల్లా పోలీసు అధికారి ప్రియాంక, మేడిపల్లి పోలీస్ స్టేషన్ సీఐ డి. జలేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పోక్సో చట్టంలోని ముఖ్యాంశాలను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. చిన్నపిల్లలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టేందుకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ (మంచిచెడు స్పర్శల) తేడాను పిల్లలు సులభంగా గుర్తించేలా అవగాహన కల్పించారు. ఒకవేళ ఎవరైనా లైంగిక వేధింపులకు గురైతే ఎలాంటి భయం లేకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని భరోసానిచ్చారు.18 ఏళ్ల లోపు బాలికలపై వేధింపులకు పాల్పడితే ఈ చట్టం ద్వారా కఠిన శిక్షలుంటాయని హెచ్చరించారు.**మహిళలు, బాలికల భద్రతకు షీటీమ్స్ నిరంతరం శ్రమిస్తున్నాయి:**సమాజంలో మహిళలు, బాలికల భద్రతను కాపాడటంలో షీ టీమ్స్ సేవలు ఎంతో కీలకమని అధికారులు తెలిపారు. వేధింపులను ఎలా ఎదుర్కోవాలో, ఫిర్యాదు లు ఏ విధంగా చేయాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలల రక్షణ, వారి చట్టపరమైన హక్కులు, నేరాల నివారణపై సమాజంలో చైతన్యం తేవడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు.పిల్లల భద్రత విషయంలో అందరూ అప్రమత్తంగా (విజిలెన్స్‌గా) ఉండాలని, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# బోడుప్పల్ పరిసర ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

- హెచ్ఎండీఏ పనుల నిమిత్తం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కోత
- ఏఈ ఎన్. వేణుగోపాల్

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),అక్టోబర్27:** బోడుప్పల్ సబ్ స్టేషన్ పరిధిలో హెచ్ఎండీఏ షిఫ్టింగ్ పనులు, వాసవి నగర్ నూతన ఎస్సెస్ కోసం 33కేవీ లైన్ స్ట్రింగింగ్ పనులు మరియు బంగారు మైసమ్మ ఆలయం నుండి ప్రివిలేజ్ కాలనీ వరకు లైన్ల మార్పు నిమిత్తం ఎం+6 టవర్ల ఏర్పాటు పనులు చేపట్టనున్నారు. ఈ పనుల కారణంగా బుధవారం ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది.విద్యుత్ కోత ఉండే ప్రాంతాలు మరియు వివరాలు:11కేవీ ఇందిరానగర్ ఫీడర్ (33/11కేవీ బోడుప్పల్ సబ్ స్టేషన్)ఉదయం 11నుండి సాయంత్రం 4గంటల వరకు.ప్రభావిత ప్రాంతాలు: సాయిరామ్ కాలనీ, శ్రీనివాస కాలనీ, బృందావన్ కాలనీ, ఆనంద్ నగర్, ఎస్సీ కాలనీ, బొమ్మక్ బ్రదర్స్ కాలనీ, తూర్పు హనుమాన్ నగర్, పశ్చిమ హనుమాన్ నగర్, సన్నీ బేకరీ మెయిన్ రోడ్, సాయి భవాని నగర్.11కేవీ వివేకానంద ఫీడర్ (33/11కేవీ ఇందిరానగర్ సబ్ స్టేషన్):ఉదయం 11 నుండి సాయంత్రం 4గంటల వరకు.ప్రభావిత ప్రాంతాలు: మణికంఠ నగర్, వివేకానంద నగర్, శ్రీ లక్ష్మీ నగర్, లెక్చరర్స్ కాలనీ, ఐఐసీటీ కాలనీ, భీం రెడ్డి కాలనీ, అశోక్ నగర్, గ్రీన్ సిటీ కాలనీ, అనాగపురి కాలనీ.11కేవీ మారుతీ నగర్ ఫీడర్ (33/11కేవీ ఇందిరానగర్ సబ్ స్టేషన్):ఉదయం 11నుండి సాయంత్రం 4గంటల వరకు.ప్రభావిత ప్రాంతాలు: యాదవ్ బస్తీ, సుభాష్ నగర్ కాలనీ, ఎస్సీ బస్తీ, మన్సాని కాలనీ, మణికంఠ నగర్, మారుతీ నగర్, సిద్ధి వినాయక నగర్, శ్రీ సాయి ఎన్‌క్లేవ్, పెంటారెడ్డి కాలనీ.విద్యుత్ వినియోగదారులు మరియు ప్రజలు ఈ విషయాన్ని గమనించి, అధికారులకు సహకరించాలని ఏఈ కోరారు.

# స్కౌట్స్‌తో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యం

**- ప్రధానోపాధ్యాయిని చప్పిడి పద్మజ**



**తొలి అక్షరం/రాయచోటి అక్టోబర్ 27:-** విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొం దించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం కీలక పాత్ర పోషిస్తుందని మోటకట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని చప్పిడి పద్మజ తెలిపారు. మంగళవారం పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రవేశ పరీక్ష నిర్వహించిన సందర్భంగా ఆమె ఈ విషయాన్ని పేర్కొన్నారు.ఈ పరీక్షలో భగత్ సింగ్ స్కౌట్ యూనిట్‌కు చెందిన 16 మంది స్కౌట్స్, సుధా మూర్తి గైడ్ కంపెనీకి చెందిన 15 మంది గైడ్స్ కలిపి మొత్తం 31 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.పరీక్షను విజయవంతంగా నిర్వహించిన స్కౌట్ మాస్టర్ బి. నరసింహులు, గైడ్ కెప్టెన్ బి.ఎస్. పద్మావతిలను, పాల్గొన్న విద్యార్థులను భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి అభినందించారు.

# కర్నూలులో ఓపెన్ హౌస్ ఆయుధాల ప్రదర్శన

**- ప్రారంభించిన అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్**




**తొలి అక్షరం/కర్నూలు అక్టోబర్ 27:-** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఓపెన్ హౌస్ ఆయుధాల ప్రదర్శన నిర్వహించారు. అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్ ప్రదర్శనను ప్రారంభించి విద్యార్థులకు పోలీసు ఆయుధాలు, భద్రతా పరికరాలపై అవగాహన కల్పించారు.ప్రదర్శనలో ఆయుధాలు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు, బాంబు డిటెక్టర్లు, బాంబ్ సూట్, డాగ్ స్క్వాడ్, వజ్ర వాహనం తదితర పరికరాలను ప్రదర్శించారు. పోలీసులు విధుల్లో ఉపయోగించే పరికరాలు, వాటి పనితీరు గురించి విద్యార్థులకు వివరించారు.ఈగల్ టీం ఆధ్వర్యంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. టోల్‌ఫ్రీ నంబర్ 1972 గురించి కూడా వివరించారు. కొండారెడ్డి బురుజు వద్ద పోలీసు బ్యాండ్ బృందం దేశభక్తి గీతాలను ఆలపించింది.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, నగరంలోని పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం.. కడప ప్రగతి ప్రస్థానం నిరంతరం



**తొలి అక్షరం/కడప అక్టోబర్ 27 :-** ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిరుమల తొలి గడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దివ్య సన్నిధి (దేవుని కడప) నుంచి శ్రీకార చుట్టుకున్న మన వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థి బండి దీప్తి ఎన్నికల ప్రచారం ఉల్లాసంగా, అత్యంత ఉత్సాహంగా, వైఎస్సార్‌సీపీ శ్రేణుల మంచి జోష్ మధ్య దేవుని కడప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవస్థాన పరిసర ప్రాంతాలలో జోరుగా ప్రచారాన్ని చేపట్టడం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు, ప్రముఖ నాయకులు వంగవీటి నరేంద్ర వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన ప్రారంభమైందని ఈ అరాచక పాలనను ప్రజలు అంతమొందించే రోజు దగ్గర పడ్డాయని తెలిపారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి మేయర్ అభ్యర్థి బండి దీప్తిని గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినాను నామినేషన్ కూడా వెయ్యనీయకుండా అరాచక శక్తులు అడ్డు తగిలాయని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులను సైతం భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని తెలిపారు. ఈ రాక్షస పాలన అంతం అందాలంటే మేర అభ్యర్థిగా బండి దీప్తిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుపులి వెంకటసుబ్బమ్మ దాసరి శివ తోట కృష్ణ నాగమణి మరియు డివిజన్ నాయకులు, క్షేత్రస్థాయి వైఎస్సార్‌సీపీ సమరయోధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వేముల జడ్పీటీసీ పోరులో నాగెళ్ల సత్య ప్రభావతమ్మ

**వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి..**

**పార్టీ అధిష్ఠానం నిర్ణయంతో సమరానికి సన్నద్ధం**

**నేడు చగలేరు గ్రామం నుంచి ప్రచారానికి శ్రీకారం**



**తొలి అక్షరం/వేముల అక్టోబర్ 27:** వేముల మండల జడ్పీటీసీ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున నాగెళ్ల సాంబశివారెడ్డి సతీమణి నాగెళ్ల సత్య ప్రభావతమ్మ పోటీ చేస్తున్నారు. పార్టీ అధిష్ఠానం ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో ఎన్నికల ప్రచారానికి సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 8:45 గంటలకు చాగలేరు గ్రామం నుంచి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజలను కలుసుకుంటూ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరనున్నారు.**గతంలో జడ్పీటీసీగా పనిచేసిన అనుభవం...**గతంలో వేముల మండల జడ్పీటీసీగా బాధ్యతలు నిర్వహించిన సత్య ప్రభావతమ్మకు స్థానిక రాజకీయాలపై అనుభవం ఉంది. గతంలో ప్రజలు అందించిన ఆదరణ తనకు ప్రోత్సాహాన్నిచ్చిందని, మరోసారి వారి ఆశీస్సులు పొందేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల బరిలో నిలిచారు **.అధిష్ఠానం ఆదేశాల మేరకు ముందడుగు...** వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి,ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సూచనలకు అనుగుణంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎన్నికలను ఎదుర్కొనేందుకు ఆమె సిద్ధమయ్యారు. మండల నాయకులు,కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రచారాన్ని కొనసాగించనున్నారు. **చాగలేరు గ్రామం నుంచి ప్రచారానికి శ్రీకారం...**బుధవారం అనగా నేడు ఉదయం 8:45 గంటలకు చాగలేరు గ్రామంలో ప్రారంభమయ్యే ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకోనున్నారు. గ్రామస్థులతో మాట్లాడి తన అభ్యర్థిత్వాన్ని పరిచయం చేసుకుంటూ మద్దతు కోరనున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొననున్నారు. **జడ్పీటీసీ స్థానంపై గురి**వేముల మండల జడ్పీటీసీ స్థానంలో విజయం సాధించాలనే లక్ష్యంతో సత్య ప్రభావతమ్మ ఎన్నికల కార్యాచరణను ప్రారంభిస్తున్నారు. పార్టీ శ్రేణుల సహకారంతో గ్రామాల్లో ప్రజలను చేరుకోవడం, తన అభ్యర్థిత్వాన్ని వివరించడం ద్వారా ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లనున్నారు. చాగలేరు నుంచి మొదలయ్యే ఈ కార్యక్రమంతో మండలంలో ఆమె ఎన్నికల ప్రచారం ప్రారంభం కానుంది.

# ఆర్నబ్ తుఫానుపై అప్రమత్తంగా ఉండాలి

- ఒక్క ప్రాణనష్టం కూడా జరగకూడదు
- అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం



**తొలి అక్షరం/అమరావతి, అక్టోబర్ 27:-** ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాను సన్నద్ధతపై సమీక్షించారు.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం అక్టోబర్ 28న యానాం సమీపంలో తుఫాను తీరం దాటే అవకాశం ఉందని, గంటకు 115125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని, 24 గంటల కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.కోతకు సిద్ధంగా ఉన్న వరి, కల్లాల్లోని ధాన్యాన్ని భద్రపరచడంతోపాటు పంటలు, ఉద్యానవనాలు, పశుసంపదకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చూడాలని, ఆక్వా చెరువుల గట్లను పరిశీలించి రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. తుఫాను తగ్గిన వెంటనే పంట, ఆస్తి నష్టాలను అంచనా వేసి సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.




# విధులను పారదర్శకంగా నిర్వహించండి

**తొలి అక్షరం/బుచ్చిరెడ్డిపాలెం అక్టోబర్ 27:-** ఎన్నికల విధులను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని బుచ్చిరెడ్డిపాలెం పురపాలక సంఘ కమిషనర్ ఇనమల చిన్నబాబు అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం డివిఎల్ఎన్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో ఇచ్చిన విధంగా, కరదీపిక చదివి బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ బూత్ లలో అన్ని సౌకర్యాలు కల్పించామని, సజావుగా విధులను నిర్వహించాలని తెలిపారు. బ్యాలెట్ బాక్స్ తెరిచే, సీల్ చేసే విధానాన్ని డెమో రూపంలో వివరించారు. జోనల్,రూట్ ఆఫీసర్స్ కూడా ఏర్పాటు చేశామన్నారు. మాస్టర్ ట్రైనర్స్ గా గండికోట సుధీర్ కుమార్, పమజుల సురేంద్రయ్య, హజరత్ బాబు, కెవి శ్రావణ్‌కుమార్,ఉపాధ్యాయులు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

Editor pastham Saidulu,R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad